వావ్.. వండర్..!

క్రీడా-కళారంగాల్లో మనోళ్లు చాలా చక్కగా రాణిస్తూ.. రాష్ట్ర-జాతీయ స్థాయిలో మన జిల్లాకు కీర్తిని తీసుకొస్తూ, అందరితో 'వావ్.. వండర్' అనిపించుకుంటున్నారు, అభినందనలు అందుకుంటున్నారు. సహ క్రీడాకారులకు, కళాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

క్రీడాకరులను అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు

పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో..

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 3: గత నెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో మన జిల్లాకు చెందిన తొమ్మిదిమంది సిబ్బంది ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు. మహిళా కానిస్టేబుల్ బి.రత్నకుమారి– యోగాలో స్వర్ణ పతకం, జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకం, కబడ్డీలో కాంస్య పతకం, 100 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం సాధించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వంశీకృష్ణ– 100 మీటర్లలో స్వర్ణ పతకం సాధించారు. ఏఆర్ మహిళా కానిస్టేబుల్ సుష్మ– 100 మీటర్లలో స్వర్ణ పతకం, 200 మీటర్లలో స్వర్ణ పతకం సాధించారు. మహిళా కానిస్టేబుల్ బి.రజని– కబడ్డీలో కాంస్య పతకం, ఆర్మ్ రెజ్లింగ్‌లో కాంస్య పతకం సాధించారు. కానిస్టేబుల్ హరికృష్ణ– టగ్ ఆఫ్ వార్‌లో కాంస్య పతకం సాధించారు. కానిస్టేబుల్ రామయ్య– హ్యాండ్ బాల్‌లో కాంస్య పతకం సాధించారు. కానిస్టేబుల్ నాగరాజు– పవర్ లిఫ్టింగ్(87 కేజీలు)లో కాంస్య పతకం సాధించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు– వెయిట్ లిఫ్టింగ్ (89 కేజీలు)లో రజత పతకం సాధించారు. కానిస్టేబుల్ ప్రవీణ్– షటిల్ బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం సాధించారు. వీరిని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు సోమవారం తన కార్యాలయంలో అభినందించి, ప్రోత్సాహక నగదు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ కురసం సత్యనారాయణ, ఆడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఐ నర్సింహారావు, ఎంటీవో ఓ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో హెడ్ కానిస్టేబుల్

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 3: కేరళ రాష్ట్రం కున్నంకులంలో సోమవారం జరిగిన జాతీయ అథ్లెటిక్స్‌లో కొత్తగూడేనికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వీరభద్రం పతకాలు సాధించారు. ఇటీవల జరిగిన 11వ తెలంగాణ స్టేట్ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిలో మూడు మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అక్కడ కూడా 1500 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు.

బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి కల్యాణ్ సుమిత్ర

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 3: జిల్లాకు చెందిన గీత రచయిత్రి కల్యాణ్ సుమిత్ర.. 250కు పైగా పాటలు రచించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఆమె పేరు 'దక్షిణ భారత బుక్ ఆఫ్ రికార్డ్స్–2025'లో చేరింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెను నిర్వాహకులు సన్మానించారు. హైదరాబాద్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ నుంచి బహుమతి అందుకున్నారు.

జోనల్ మీట్‌లో టెన్నిస్ క్రీడాకారులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 3: గత నెల 24, 25 తేదీల్లో ఖమ్మంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్టా స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి టెన్నిస్ పోటీల్లో పాల్వంచలోని నారాయణ స్కూల్ విద్యార్థిని ప్రవసి, నవభారత్ స్కూల్ విద్యార్థిని భానుశ్రీ.. ప్రథమ, ద్వితీయ స్థాయి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. 55 సంవత్సరాల విభాగంలో కోచ్ అన్నం వెంకటేశ్వర్లు ద్వితీయ స్థానంలో నిలిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉద్యోగినులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 3: గత నెల 21 నుంచి 23 వరకు కేటీపీఎస్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్టేట్ ఇంటర్ ప్రాజెక్ట్స్ పోటీలు జరిగాయి. కేటీపీఎస్ 5, 6 దశలకు చెందిన ఉద్యోగినులు.. బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్‌లో విజేతలుగా నిలిచారు. వీరిని సీఈ ప్రభాకర్‌రావు సోమవారం తన కార్యాలయంలో అభినందించి సన్మానించారు.

కోలిండియా క్రికెట్ పోటీల్లో సింగరేణి

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 3: కోలిండియా స్థాయి క్రికెట్ పోటీల్లో సింగరేణి జట్టు బోణీ కొట్టింది. నాగ్‌పూర్‌లో సోమవారం ప్రారంభమైన కోలిండియా స్థాయి క్రికెట్ పోటీల్లో ఎంసీఎల్ వర్సెస్ ఎస్‌సీసీఎల్ పోటీల్లో సింగరేణి మొదటి బ్యాటింగ్ చేపట్టి, నిర్ణీత ఓవర్లలో 128 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. ఎంసీఎల్ 95 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి ఓడింది. సింగరేణి జట్టు గెలిచింది. ఈ జట్టులోని శశికాంత్.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచారు.

ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య

విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలం, ఫిబ్రవరి 3: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాగ్గేయకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్త రామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు భజన బృందం డి.నిహారిక, డా. యనమండ్ర శ్రీనివాస శర్మ, వాగ్దేవి, వైష్ణవి, బి.లలితా మాధవ్ నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన కవిత, శ్రీహరి దంపతులు గోశాల నిర్మాణ పనులకు రూ.56,425 విరాళం అందజేశారు.

బాల్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 3: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన లక్ష్యంగా ఈ నెలలో బాల్ మేళా జరగనుంది. ఈ కార్యక్రమయ పోస్టర్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈవో వెంకటేశ్వర చారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ పాల్గొన్నారు.

మణుగూరు ఏరియాలో భారీ క్రేన్ ప్రారంభం

భారీ క్రేన్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 3: 40 టన్నుల కెపాసిటీ గల ఆధునిక టైర్ మౌంటెడ్ రఫ్ టెర్రెయిన్ భారీ క్రేన్‌ను రూ.1.74 కోట్లకు సింగరేణి యాజమాన్యం కొనుగోలు చేసి మణుగూరు ఏరియా ఓసీకి కేటాయించారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ క్రేన్ ప్రారంభించారు. క్రేన్ నిర్ణీత జీవిత కాలాన్ని వినియోగించుకునేలా నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకటారామారావు, పీవో శ్రీనివాసచారి, డీజీఎం రమేష్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చర్ల, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని సత్యనారాయణపురం, ఆర్ కొత్తగూడెం గ్రామాల మధ్య సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మడకం కోమలి, మడకం మంగు మోటరు సైకిల్‌పై భద్రాచలం వైపు వెళ్తుండగా భద్రాచలం నుంచి చర్ల వస్తున్న టాటా మ్యాజిక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు క్షతగాత్రులను సత్యనారాయణపురం పీహెచ్‌సీకి తరలించారు. మడకం మంగు పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద మలుపు అనే హెచ్చరికలు లేవు. గతంలో ఇదే ప్రదేశంలో అనేక ప్రమాదాలు జరిగాయని, పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయిని స్థానికులు తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

గాయపడిన యశ్వంత్

టేకులపల్లి, ఫిబ్రవరి 3: చిన్నారిపై వీధి కుక్కలు చిదాడి చేసిన దారుణమిది. టేకులపల్లికి చెందిన కేలోత్ మోహన్ కుమారుడు యశ్వంత్. సోమవారం మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కడే వెళ్తుండగా ఓ వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. ఆ చిన్నారి తొడకు తీవ్ర గాయమైంది. ఆ చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగు పరుగున వచ్చి ఆ కుక్కను తరిమేశారు. ఆ చిన్నారిని వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్ పరిస్థితి నిలకడగా ఉందని తండ్రి మోహన్ తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అశ్వాపురం, ఫిబ్రవరి 3: విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్లగట్ల సత్యప్రకాష్ ఆకాంక్షించారు. సోమవారం మండల కేంద్రంలోని కందుల కృష్ణార్జున్‌రావు కాంప్లెక్సు వెనుక తేజస్విని అకాడమీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కోచింగ్ నిర్వాహకులు తేజస్వి మాట్లాడుతూ.. ఐఐటీ, సివిల్, నీట్ పరీక్షల విద్యార్థులకు గతంలో శిక్షణ ఇచ్చి విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. పూర్తిస్థాయిలో కోచింగ్ ఇవ్వడానికి తేజస్విని అకాడమీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. కందుల కృష్ణార్జునరావు, వెంకటేశ్వర్లు, నక్కబోయిన పాపారావు, తూము రాఘవులు, దుర్గాభవాని పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా లారీ యార్డు

మద్యం సీసాలు పగులగొట్టి పడేయడంతో వాకర్లకు ఇబ్బందులు

మందుబాబులు తాగి వదిలేసిన మద్యం బాటిళ్లు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని సారపాకలోని ఐటీసీ లారీ యార్డు మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతి నిత్యం రాత్రి సమయాల్లో ఈ యార్డు వద్దకు వచ్చి పూటుగా మద్యం తాగి వెళ్తుంటారు. అయితే మద్యం బాటిళ్లు తాగిన తర్వాత మత్తులో పగులగొట్టడం, అక్కడే పదుల సంఖ్యలో వదిలి వెళ్తుండడంతో నిత్యం సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వచ్చిన సమయంలో వాకర్ల ఇబ్బందు పడుతున్నారు. మందుబాబులు మద్యం తాగేందుకు యార్డులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాకర్లు కోరుతున్నారు.

ఎంపీటీసీ స్థానాల జాబితా విడుదల

పినపాక, ఫిబ్రవరి 3: మండలంలోని 9 ఎంపీటీసీ స్థానాల తుది జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సునీల్‌శర్మ సోమవారం నోటీస్ బోర్డు నందు ప్రచురించారు. ఎంపీటీసీ స్థానాలు దుగినేపల్లి, జానంపేట, అమరవరం, సింగిరెడ్డిపల్లి, ఎల్చిరెడ్డిపల్లి, భూపాలపట్నం, ఏడూళ్ళబయ్యారం, తోగ్గూడెం, సీతంపేటను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో ప్రచురించారు.

ఎంపీటీసీ స్థానాల జాబితా ప్రదర్శన

అశ్వారావుపేట, ఫిబ్రవరి 3: ఎంపీటీసీ స్థానాల జాబితాను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటు నేపథ్యంలో మండలంలోని ఎంపీటీసీ స్థానాలను కుదించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 17 ఎంపీటీసీ స్థానాలను 11కు తగ్గించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ భాగంగా మారినందున అశ్వారావుపేటలోని నాలుగు, పేరాయిగూడెంలోని రెండు స్థానాలను తొలగించినట్లు వివరించారు. పేరాయిగూడెం–2 ఎంపీటీసీ పరిధిలోగల పాత అల్లిగూడెం పంచాయితీని నారంవారిగూడెం ఎంపీటీసీ స్థానంలో చేర్చినట్లు తెలిపారు. వేదాంతపురం పంచాయతీని ఊట్లపల్లి ఎంపీటీసీ స్థానంలో కలిపినట్లు పేర్కొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహాలక్ష్మి సోమవారం ప్రదర్శించారు. ఈ జాబితాలో అన్నపురెడ్డిపల్లి–1, అన్నపురెడ్డిపల్లి–2, పెంట్లం, నర్సాపురం, గుంపెన, పెద్దిరెడ్డిగూడెం స్థానాలు ఉన్నాయి.

చంద్రుగొండ, ఫిబ్రవరి 3: చంద్రుగొండ మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాల జాబితాను ఎంపీడీవో అశోక్ సోమవారం ప్రకటించారు. ఇందులో చంద్రుగొండ–1, చంద్రుగొండ–2, దామరచర్ల, తిప్పనపల్లి, తుంగారం, రావికంపాడు, పోకలగూడెం, బెండాలపాడు స్థానాలు ఉన్నాయి.

పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు

పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 3: మండలంలోని గుట్టమల్లారం వద్ద ఉన్న పంచముఖ వేద గాయత్రి మాత ఆలయంలో శ్రీపంచమి (వసంత పంచమి) సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి సావిత్రి సరస్వతి స్వరూపమైన అమ్మవారి ఎదుట చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయ వ్యవస్తాపక ధర్మకర్త బ్రహ్మశ్రీ దయానిది అక్కినేపల్లి వసంతాచార్యులు, అక్కినేపల్లి ప్రదీప్‌శాస్త్రి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బూర్గంపాడు, ఫిబ్రవరి 3: బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలోని బ్రిలియంట్ విద్యా సంస్థల్లో సామూహిక సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎన్.ఆర్. దంపతులు అమ్మవారికి అభిషేకం, అర్చన నిర్వహించి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం 30 మంది దంపతులతో కలిసి సరస్వతీ పూజ నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 3: అశ్వారావుపేట మున్సిపల్ తొలి కమిషనర్ కె.సుజాతను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వాసవీ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ శీమకుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో బాధ్యులు సన్మానించారు. వార్డు ఆఫీసర్ కె.శ్రీరామ్మూర్తి, క్లబ్ బాధ్యులు ఆర్‌కె.శివ, కలకోటి సత్యనారాయణ, ఉప్పల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో కూలీ దుర్మరణం

ఇల్లెందు, ఫిబ్రవరి 3: క్వారీలో సైజు రాళ్లు కొడుతున్న కూలీ మీద రాళ్లు పెళ్లలు పడ్డాయి. తీవ్ర గాయాలతో అతడు మృతిచెందాడు. అతడి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ఇల్లెందు మున్సిపాలిటీ 24వ వార్డుకు చెందిన పల్లపు ఎల్లయ్య(38), రాజీవ్ నగర్ సమీపాన రాళ్ల క్వారీలో సోమవారం కూలి పనికి వెళ్లాడు. అక్కడ రాళ్లు పగలగొడుతుండగా ప్రమాదవశాత్తు పై నుంచి రాళ్ల పెళ్లలు కూలి పడ్డాయి. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తెలంగాణపై వివక్షకు నిరసన

ఇల్లెందు : నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

భద్రాచలం : బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

ఇల్లెందు, ఫిబ్రవరి 3: బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని చూపిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందులో ర్యాలీ జరిగింది. వివక్షను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద పత్రం సమర్పించారు. నాయకులు దమ్మాల పాటి వెంకటేశ్వరరావు, అనసూయ, మడుగు సాంబమూర్తి, డానియల్, పులి సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, ఫిబ్రవరి 3: స్థానిక బోడు రోడ్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరం సురేందర్, భూక్యా దేవ, గణేష్, పోశాలు, రజని, ప్రసాద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'నిధులు ఇవ్వకపోవడం దారుణం'

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 3: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొవ్వూరు రైల్వే లైన్‌కు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించకపోవడంపై సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డీఆర్‌యూసీసీ మెంబర్ వై.శ్రీనివాస్‌రెడ్డి తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన చేశారు.

వ్యవసాయ రంగాన్ని విస్మరించిన బడ్జెట్

టేకులపల్లి, ఫిబ్రవరి 3: వ్యవసాయ రంగాన్ని కేంద్ర బడ్జెట్ విస్మరించిందని జిల్లా కిసాన్ సంయుక్త మోర్చా కన్వీనర్ బానోత్ ఊక్ల విమర్శించారు. ఆయన సోమవారం స్థానిక బోడు రోడ్ సెంటర్‌లో మోర్చా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌తో దేశ రైతాంగానికి ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. నాయకులు కడుదుల వీరన్న, ఉప్పరబోయిన రామ్మూర్తి, జర్పుల సుందర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం

భద్రాచలం, ఫిబ్రవరి 3: భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండారు శరత్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రానికి బడ్జెట్లో ఎటువంటి నిధులు కేటాయించలేదని, నిధులు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల ఒకరంగా, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల పట్ల మరో రకంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పారెల్లి సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి, కోరాడ శ్రీనివాసరావు, కుంజా శ్రీనివాస్, చుక్క మాధవరావు, ఎం.విఎస్.నారాయణ, డి.సతీష్‌కుమార్, చాట్ల శ్రీను, ముత్తయ్య పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

బూర్గంపాడు, ఫిబ్రవరి 3: సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ బడా బాబులకి, కాంట్రాక్టర్లకు అనుకూలమైనదిగా ఉన్నదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంకు జీరో చేయడం చాలా దారుణమని, బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలున్నా ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో బయ్యా రాము, పాండవుల రామనాథం, ఎస్కే అబీదా, గుంటుక కృష్ణ, కమటం మరియమ్మ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

ఆళ్లపల్లి : జాతర పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కొమరం వంశీయులు

దుమ్ముగూడెం : జాతరలో డప్పు వాయిద్యాలు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 3: గోదావరి నదీతీరాన దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కుంకుమ పూజలు తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. జాతరలో భాగంగా డప్పు వాయిద్యాలతో జాతర తొలిరోజు ప్రారంభమైంది. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని మర్కోడు పంచాయతీ పెద్దురు గ్రామంలో జరిగే రెక్కల రామక్క జాతర పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కొరం కనకయ్య సతీమణి లక్ష్మి, మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. రెక్కల రామక్క జాతర ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొమరం వెంకన్న, రాంబాబు, కృష్ణంరాజు, వెంకటేష్, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన గెలల ధర

అశ్వారావుపేట, ఫిబ్రవరి 3: ఆయిల్‌పాం గెలల ధర జనవరి నెలకు స్వల్పంగా తగ్గింది. గత ఏడాది డిసెంబర్‌లో టన్ను ధర రూ.20,506 ఉంది. జనవరికి రూ.20,487కు తగ్గింది. జనవరిలో ఫ్యాక్టరీకి తరలించిన గెలలకు మాత్రమే ఈ ధర వర్తిస్తుందని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 3: రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు రద్దు చేయాలన్న డిమాండుతో ఈ నెల 5న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ సలీమ్ చెప్పారు. ఆయన సోమవారం సీపీఐ స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

6 నుంచి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 3: ఈ నెల 6,7,8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు స్థానిక హనుమాన్ బస్తీ ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను నిర్వాహకులు డాక్టర్ సావిత్రి, అధ్యక్షుడు యుగందర్‌రెడ్డి సోమవారం ఆహ్వానించారు.

'సేవాలాల్ మహరాజ్ జయంతికి సెలవు ఇవ్వాలి'

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 3: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఈ నెల 15న సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు టిస్టా నాయకులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఆంగోత్ తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సమితి కమిటీ ఏర్పాటు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 3: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల సమితి వార్షిక సర్వసభ్య సమావేశం కొత్తగూడెంలో సోమవారం జరిగింది. మార్పులు చేర్పులతో నూతన కమిటీని ఎన్నుకుంది. జనరల్ సెక్రటరీగా గోపీచందర్, వైస్ ప్రెసిడెంట్లుగా దేవయ్య, శంకర్; జాయింట్ సెక్రటరీలుగా యాదగిరి, షేక్ జానీపాషా, జయరాజు, రాంచందర్, కనకరాజు, మరికొందరు ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 3: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని, క్యాలెండర్‌ను 5,6 దశల సీఈ మేక ప్రభాకర్‌రావు సోమవారం ఆవిష్కరించారు. నాయకులు కూరపాటి రమేష్, వరికూటి శ్రీనివాసరావు, పోడెం కృష్ణ, నవీన్, శ్రావణ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మద్దతు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 3: జీవో నంబర్ 51 రద్దు చేయాలని, వేతనాలు ఇవ్వాలని కోరుతూ మండల కేంద్